## క్లుప్తంగా

### శారదా పీఠంలో అక్కరమాని దంపతుల పూజలు



స్వరూపానందేంద్ర సరస్వతి ఆశీస్సులు తీసుకుంటున్న అక్కరమాని దంపతులు

**ఎంవీపీ కాలనీ:** చినముషిడివాడలోని శారదా పీఠంలో వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, వెంకటరావు దంపతులు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. శారదా పీఠాధిపతి శ్రీస్వరూపానందేంద్ర సరస్వతిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం పలు విషయాలను స్వామీజీతో పంచుకోవడంతో పాటు రాజశ్యామలాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు.

### అందరి సహకారంతో కాలుష్య నియంత్రణ



సైకిల్‌పై కార్యాలయానికి చేరుకుంటున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

**దాబాగార్డెన్స్:** కాలుష్య నిర్మూలనకు నగర పౌరులందరూ సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. నగర కాలుష్య నియంత్రణలో భాగంగా సోమవారం ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి జీవీఎంసీ కార్యాలయానికి సైకిల్‌పై చేరుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం అవసరమన్నారు. నగరంలో శబ్ద, వాయు కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా సాధ్యమైనంత వరకు ప్రజా రవాణా, కాలుష్య రహిత వాహనాలు వినియోగించాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.

### బాలికను కాపాడిన బీచ్ గార్డ్స్

**బీచ్ రోడ్డు:** సముద్రంలో ఆత్మహత్యకు ప్రయత్నించిన బాలికను బీచ్ లైఫ్‌గార్డ్స్ రక్షించారు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. నగరానికి చెందిన బాలిక సోమవారం ఆర్కే బీచ్ వద్ద సముద్రంలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించగా.. అక్కడ ఉన్న బీచ్ గార్డ్స్ ఆమె ప్రవర్తనను గమనించి అడ్డుకున్నారు. అనంతరం ఆమెను పోలీసులకు అప్పగించారు. ఆమెకు కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

### 'చంద్రబాబు హయాంలో అంతా ఆనందం'



మాట్లాడుతున్న వంగలపూడి అనిత

**మద్దిలపాలెం :** రాష్ట్ర ప్రజలు చంద్రబాబు పాలనలో ఆనందంతో ఉంటే.. సీఎం జగన్ పాలనలో ఆందోళనకరంగా ఉన్నారని టీడీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత అన్నారు. ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పథకాల పేరుతో బటన్ నొక్కితే ఒక్కరికే వెళ్తోందని, కానీ వేలాది మందికి వెళ్తుతుందని ప్రచారం చేసుకుంటున్నారన్నారు. మద్యపాన నిషేధం చేసి మళ్లీ ఓటు అడుగుతా అని సీఎం జగన్ అన్నారన్నారు. కానీ ఇప్పుడు మద్యం మీద రూ.98 వేల కోట్లు ప్రభుత్వం ఆర్జిస్తుందన్నారు. మద్యం ఆదాయంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఏడాదికి రూ.5 వేల కోట్లు చేరుతున్నాయని ఆమె విమర్శించారు. అసెంబ్లీలో ఎన్టీఆర్ కుమార్తెపై అవమానకరంగా మాట్లాడినప్పుడు.. రోజా మద్దతుదారులు ఎందుకు నోరువిప్పలేదని ప్రశ్నించారు. రేణుదేశాయ్ గురించి రోజా తప్పుగా మాట్లాడారన్నారు. దళిత ఎమ్మెల్యేగా తనను అసెంబ్లీలో అవమానపరిస్తే ఎందుకు మాట్లాడలేదన్నారు.





దట్టమైన పిచ్చి మొక్కల మధ్యతో రే గదులు



ఆరిలోవ శివారు శివాజీనగర్-2లో రే గదులు

# 'రే' గృహాల్లో ఆకతాయిల తిష్ట

- నిరుపయోగంగా రే తాత్కాలిక నివాసాలు
- శివాజీనగర్-2లో నిత్యం మందుబాబుల హల్‌చల్



చోరీకి గురైన రే ఇళ్ల తలుపులు

**ఆరిలోవ:** జీవీఎంసీ 13వ వార్డులో నిరుపయోగంగా ఉన్న 'రే' తాత్కాలిక నివాసాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. రాత్రి, పగలు తేడా లేకుండా నిత్యం గంజాయి, మద్యం సేవించే బాబులు హల్‌చల్ చేస్తున్నారు. ఈ మార్గంలో రాకపోకలకు మహిళలు, విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. జీవీఎంసీ 12వ వార్డు సూర్యతేజానగర్‌ను జీవీఎంసీ గతంలో మురికివాడగా గుర్తించింది. 2012లో రాజీవ్ ఆవాస్ యోజన(రే) పథకం కింద ఈ కాలనీని అభివృద్ధి చేయడానికి నిర్ణయించింది. అనంతరం కొన్నాళ్ల తర్వాత ఈ పథకంలో భాగంగా ఇక్కడ ప్రజలకు పక్కాగా 204 మంది లబ్ధిదారులకు నివాసాలు నిర్మించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. 2015లో ఇక్కడ ఉన్న నివాసాలు ఖాళీ చేయించి తాత్కాలిక 'రే' నివాసాలను శివాజీనగర్-2 సమీపం, పార్వతీనగర్ గెడ్డ అంచున నిర్మించారు. ఆయా చోట్ల గోడలు కోసం సిమెంట్ పలకలకు బోల్టులు బిగించి గదులు నిర్మించారు. ఆ గదులను లబ్ధిదారులకు తాత్కాలికంగా కేటాయించారు. సూర్యతేజానగర్‌లో రే శాశ్వత ఇళ్లు పూర్తయ్యాయి. దీంతో తాత్కాలిక నివాసాలను ఏడాదిన్నర క్రితమే ఖాళీ చేశారు. అప్పటి నుంచి తాత్కాలిక నివాసాలు నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో వాటిని మందుబాబులు, గంజాయి బ్యాచ్‌లు వినియోగించుకుంటున్నారు. కాలనీని ఆనుకొని ఉన్న పార్వతీనగర్ గెడ్డ అంచుని తాత్కాలిక నివాసాలను స్థానికులు ఫిర్యాదుతో నెల కిందట పూర్తిగా తొలగించేశారు. శివాజీనగర్-2లో కాలనీకి కొంత దూరంలో ఉన్న సుమారు 100కు పైగా రే తాత్కాలిక నివాసాలను మాత్రం జీవీఎంసీ అధికారులు తొలగించకుండా వదిలేశారు. దీంతో ఇక్కడ కొన్ని నివాసాలకు అమర్చిన తలుపులు, ద్వారాలు దొంగలు పట్టుకుపోయారు. నివాసాల మధ్య పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగిపోయాయి. పాములు, విషపురుగుల సంచారం ఎక్కువైపోయింది. మరోవైపు కొందరు ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు వినియోగించుకుంటున్నారు. సాయంత్రమైతే అటుగా వెళ్లే వాకర్స్, వాహనచోదకులు మందుబాబులు, గంజాయి మూకల అల్లరితో ఇబ్బందిపడుతున్నారు.

### 'రే'గదులను షాపింగ్ కాంప్లెక్స్‌గా మార్చాలి..

ఇక్కడ నిరుపయోగంగా ఉన్న గదులను షాపింగ్ కాంప్లెక్స్‌గా మార్చితే ప్రజలకు మేలు కలుగుతుంది. అధిక జనాభా ఉన్న ఈ ప్రాంతంలో ఎక్కడా షాపింగ్ కాంప్లెక్స్ లేదు. పిచ్చి మొక్కలు పెరగడంతో పాములు సంచారం ఎక్కువైంది. విషపురుగులు రోడ్ల మీదకు సైతం వచ్చేస్తున్నాయి.

– ఆర్.అశోక్‌రావు, నలబై గజాల రోడ్డు, ఆరిలోవ

### అసాంఘిక కార్యకలాపాలు నివారించాలి

జీవీఎంసీ అధికారులు, ప్రజా ప్రతినిధులు నిరుపయోగంగా ఉన్న రే నివాసాలపై దృష్టి పెట్టాలి. వీటిని తొలగించడమో, లేదంటే ప్రజలకు ఉపయోగపడేలా వినియోగించడమో చేయాలి. అలాంటప్పుడే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్టపడుతుంది. ఇవి ఖాళీగా ఉండటంతో కొందరు గుంపులుగా ఇక్కడ నిత్యం మద్యం తాగడం, గంజాయి సేవించడం చేస్తున్నారు. అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలి.

– ఎస్.ఆదినారాయణ, వాకర్, ఆరిలోవ

### తక్షణ చర్యలు చేపడతాం..

ఆరిలోవ కాలనీలో ఉన్న రే తాత్కాలిక నివాసాలు నిరుపయోగంగా ఉన్నాయి. వీటి విషయాన్ని జీవీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి వాటిని తొలగించేలా తక్షణం చర్యలు చేపడతాం. ఇటీవల పార్వతీనగర్ గెడ్డ వద్ద ఉండే తాత్కాలిక నివాసాలను తొలగించాం.

– కనకమహాలక్ష్మి, జోన్-2 కమిషనర్

## మాదక ద్రవ్యాలు, బాల్య వివాహాలపై అవగాహన

**ఎంవీపీ కాలనీ:** మాదక ద్రవ్యాలు, బాల్య వివాహాలపై ఎంవీపీ కాలనీలోని వీఎంసీ డిగ్రీ కళాశాలలో సోమవారం అవగాహన కల్పించారు. కళాశాలతో పాటు సిఫా ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జగదీశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. సామాజిక పరిస్థితులు, చెడు వ్యసనాలకు లోనై చాలా మంది మాదక ద్రవాలకు బానిసలుగా మారుతున్నారన్నారు. ఈ పరిస్థితులకు దూరంగా ఉండేందుకు విద్యార్థులు ఉన్నత చదువులు, లక్ష్యాలు దిశగా అడుగులు వేయాలన్నారు. బాల్య వివాహాల రహిత సమాజానికి కృషి చేయాలన్నారు. అనంతరం బాల్య వివాహాలపై అవగాహన కోసం రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఫా ట్రస్ట్ సీఈవో డాక్టర్ శశిప్రభ, తదితరులు పాల్గొన్నారు.

## దేవీ నవరాత్రి ఉత్సవాలకు పందిరి రాట

**ఏయూ క్యాంపస్:** జీవీఎంసీ 10వ వార్డు శాంతినగర్ సిద్ధార్థ యూత్ ఆధ్వర్యంలో దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలకు సోమవారం పందిరి రాట వేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ నాయకుడు అక్కరమాని వెంకటరావు, వార్డు నాయకులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన పథకానికి వంట సామగ్రి పంపిణీ



వంట సామగ్రి అందిస్తున్న అధికారులు

**ఏయూ క్యాంపస్:** చినగదిలి మండలం పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన వంట సామగ్రిని ప్రభుత్వం సమకూర్చింది. ఆయా సామగ్రిని మండలంలో ఉన్న పాఠశాలలకు చినగదిలి మండల విద్యాశాఖాధికారి సిహెచ్.రవీంద్రబాబు సోమవారం అందజేశారు. మొత్తం 71 పాఠశాలలకు పంపిణీ చేశారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జి.దుర్గా భవాని, విశ్వనాథం, రాజు, సూర్యనారాయణ, సీఆర్‌పీ ఎం.అప్పలరాజు, రామలక్ష్మి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా నిత్య కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం , శేషవస్త్రాలు అందజేశారు.

## 15 నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

- అమ్మవార్ల ఆలయాల్లో సన్నాహాలు
- కనకమహాలక్ష్మి దేవస్థానంలో అష్టలక్ష్మి అవతారాల్లో దర్శనం



ధనలక్ష్మిగా దర్శనమిచ్చిన కనకమహాలక్ష్మి అమ్మవారికి చామంతులతో అర్చన (ఫైల్)

**దాబాగార్డెన్స్:** శరన్నవరాత్రి మహోత్సవాలకు అమ్మవారి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. ఈ నెల 15 నుంచి ఉత్సవాలు ప్రారంభం కానుండటంతో కమిటీలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి. కనకమహాలక్ష్మి దేవస్థానంలో, దుర్గాలమ్మ ఆలయంలో, కురుపాం మార్కెట్ సమీపంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవార్లు తొమ్మిది రోజులూ విశేష అలంకరణల్లో దర్శనమీయనున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భవానీ భక్తులు ఇప్పటికే మాలలు ధరించారు.

**ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మికి విశేష పూజలు**

బురుజుపేటలోని కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 15 నుంచి 23 వరకు నవరాత్రి మహోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారిని అష్టలక్ష్మీ అవతారాల్లో అలంకరించి, విశేష పూజలు నిర్వహించనున్నారు. ఈ నెల 15వ తేదీన, ఉత్సవాల మొదటి రోజు అమ్మవారిని ఆదిలక్ష్మిగా అలంకరించి, లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నారు. 16న ధనలక్ష్మి అవతారంలో లక్ష చామంతులతో పూజ, 17న ధాన్యలక్ష్మి అవతారంలో లడ్డూల పూజ, 18న ధైర్యలక్ష్మి అవతారంలో లక్ష తులసి పూజ జరిపించనున్నారు. 19న సంతానలక్ష్మి అవతారంలో అలంకరించి, కలువపూలతో పూజ చేయనున్నారు. 20న విద్యాలక్ష్మిగా అలంకరించి, శ్రీ పుష్పయాగం, 21న గజలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చే అమ్మవారికి లక్ష గాజులతో పూజ నిర్వహించనున్నారు. 22న విజయలక్ష్మిగా దర్శనమిచ్చే అమ్మవారికి శాకాంబరిగా పండ్లు, పుష్పాలతో అలంకరించనున్నారు. 23న స్వర్ణలక్ష్మి అలంకరణలో, 108 బంగారు పుష్పాలతో స్వర్ణపుష్పార్చన జరిపించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లలో కమిటీ నిమగ్నమైంది.

## కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

**మద్రిపాలెం:** కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిని కారు ఢీకొనడంతో గాయాలైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం దుర్గానగర్‌లో నివసిస్తున్న బి.మహంతి దుస్తుల వ్యాపారం చేస్తుంటాడు. ఆదివారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో తన బావమరిది బైకుపై కంచరపాలెం నుంచి పూర్ణామార్కెట్‌కు వెళ్తున్న క్రమంలో జ్ఞానాపురం వద్దకు వచ్చేసరికి గాజువాక నుంచి అటుగా వస్తున్న జీఏ08ఎఫ్ 6126 నంబర్ గల కారు వేగంగా వచ్చి బైకును ఢీకొట్టింది. వెనక కూర్చున్న మహంతి ఒక్కసారిగా కింద పడిపోగా.. అతడి కుడి కాలుకు ఫ్రాక్చర్ అయ్యింది. క్షతగాత్రుడిని చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. మహంతి ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ మూర్తి కేసు దర్యాప్తు చేపట్టారు.

## అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు



దాతలకు ప్రసాదం అందజేస్తున్న ఏఈవో నరసింగరావు



దాతకు బాండ్ అందజేస్తున్న పీఆర్వో నాయుడు

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి సోమవారం అనకాపల్లికి చెందిన మళ్ల రామకోటేశ్వరరావు లక్షా 116 రూపాయిల విరాళం ఇచ్చారు. దేవస్థానం తరఫున దాతకు పీఆర్వో నాయుడు అన్నప్రసాద బాండ్ అందజేశారు. స్వామివారి దర్శనం కల్పించారు. స్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరానికి చెందిన బి.అశ్విని, సురేందర్‌రెడ్డి దంపతులు రూ. లక్ష విరాళం ఇన్‌చార్జి ఏఈవో పాలూరి నరసింగరావుకు అందజేశారు. దేవస్థానం తరఫున దాతలకు స్వామివారి దర్శనం కల్పించారు.

## శ్రీవారికి ప్రత్యేక పూజలు

**ఎంవీపీ కాలనీ:** స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో శ్రీవేంకటేశ్వరస్వామికి సోమవారం ప్రత్యేక పూజ లు నిర్వహించారు. కార్తీక దిపోత్సవ బృందం, వైద్య విజ్ఞాన విపంచి సంయుక్త ఆధ్వర్యంలో ఉద యం 6 గంటలకు శ్రీవారి సుప్రభాత సేవా, అర్చనలు చేశారు. 7 గంటలకు తోమాల సేవ, 8.30 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. సంస్థ ప్రతినిధి హిమాంశు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

**దాబాగార్డెన్స్:** బురుజుపేట కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలి.

## 13వ వార్డులో జగనన్న సురక్ష వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పాల్గొన్న జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి

**బీచ్ రోడ్డు:** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం జీవీఎంసీ 13వ వార్డు ఆరిలోవ కాలనీ ఆఖరి బస్టాప్ దగ్గర ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో సోమవారం జరిగింది. వైద్య శిబిరాన్ని జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి ప్రారంభించారు. ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని జెడ్సీ అన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్ ప్రసాద్, మలేరియా అధికారి తులసి, తదితరులు పాల్గొన్నారు.

## నైపుణ్యాలు పెంచుకోవాలి



శిక్షణకు హాజరైన ఎన్టీపీసీ అధికారులతో ఐఐఎం అధికారులు

**ఏయూ క్యాంపస్:** సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఎన్టీపీసీ సింహాద్రి హెచ్‌వోపీ సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. ఐఐఎం విశాఖపట్నం క్యాంపస్‌లో ఎన్టీపీసీ అధికారులకు నిర్వహిస్తున్న లీడర్‌షిప్ కోర్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తిలో పరిణితి సంస్థ అభ్యున్నతికి దోహదపడుతుందన్నారు. ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు వ్యక్తి ఉన్నతికి ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. ఐఐఎం విశాఖపట్నం ఇటువంటి కార్యక్రమాలను విస్తృతగా నిర్వహించాలన్నారు. నిర్వహణ సామర్థ్యాలను పెంపొందించుకునే విధంగా ఈ శిక్షణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఎన్టీపీసీ హెచ్‌ఆర్ విభాగాధిపతి రుమా డి.శర్మ మాట్లాడుతూ ఇటువంటి ప్రత్యేక కోర్సులు సంస్థలో పనిచేసే ఉద్యోగుల ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాయన్నారు. ఐఐఎం పరిపాలన విభాగం డీన్ ఆచార్య ఎం.వి.అనూరాధ మాట్లాడుతూ భవిష్యత్ నాయకత్వాన్ని తీర్చిదిద్దడానికి, సంస్థ ప్రగతికి దోహదపడే వ్యక్తులుగా తమ సిబ్బందిని మలచడానికి ఇటువంటి ప్రత్యేక కోర్సులను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐఎం సంచాలకుడు ఆచార్య ఎం.చంద్రశేఖర్, ప్రోగ్రాం డైరెక్టర్ ఆచార్య విశాల్ సింఘ్ పట్యాల్, తదిరతులు పాల్గొన్నారు.

## జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో 'ఉక్కు' మహిళల ప్రతిభ



షీల్డులు అందుకుంటున్న అంజలి, రోజాకుమారి, సంధ్యారాణి, సంధ్యాసాహు

**ఉక్కునగరం:** విశాఖ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఉక్కునగరం మహిళలు యు.అంజలి, పి.రోజా కుమారి, పి.సంధ్యారాణి, సంధ్యా సాహు ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారు. జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోలీస్ బ్యారెక్స్‌లో ఆదివారం పలు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉక్కునగరానికి చెందిన యు.అంజలి 55+ కేటగిరీలో డిస్కస్ త్రో, షాట్‌పుట్ విభాగాల్లో ప్రథమ బహుమతులు గెలుపొందారు. 50+ కేటగిరీలో పి.రోజా కుమారి 5 కిలో మీటర్ల నడక పోటీలో, షాట్‌పుట్ పోటీల్లో ప్రథమ బహుమతులు కైవసం చేసుకున్నారు. 50+ కేటగిరీ పోటీల్లో పి.సంధ్యారాణి 5 కిలోమీటర్ల నడక పోటీల్లో ప్రథమ బహుమతి గెలుపొందారు. 40+ కేటగిరీ పోటీల్లో సంధ్యా సాహు డిస్కస్ త్రో, షాట్‌పుట్‌లో ప్రథమ బహుమతులు కైవసం చేసుకున్నారు. వీరు నలుగురు డిసెంబర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా అసోసియేషన్ కార్యదర్శి టి.వెంకటాద్రి తెలిపారు.

### ఏయూ సమాచారం..

## జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

**ఏయూ క్యాంపస్:** ఆంధ్ర విశ్వవిద్యాలయం భౌతిక శాస్త్ర విభాగంలో నవంబరు 2, 3, 4 తేదీల్లో ద్రవ స్ఫటికాలపై నిర్వహించే మూడు రోజుల జాతీయ సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సదస్సుకు దేశ, విదేశాల శాస్త్రవేత్తలు, పరిశోధకులు 250 మందికిపైగా హాజరై తమ పరిశోధన పత్రాలను సమర్పించనున్నారు. ఈ కార్యక్రమంలో సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆచార్య కె.బసవయ్య, కన్వీనర్ డాక్టర్ రామకృష్ణ నాంచార రావు, భౌతిక శాస్త్ర విభాగాధిపతి ఆచార్య ఎస్.శ్రీనివాసరావు, ఆచార్య ఎన్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నిషేధంతోనే పర్యావరణ పరిరక్షణ



సదస్సులో పాల్గొన్న రెక్టార్ ఆచార్య కె.సమత

**ఏయూ క్యాంపస్:** పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్‌ను నిషేధించడం తప్పనిసరని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం మెరైన్ లివింగ్ రిసోర్సెస్ విభాగం ఆధ్వర్యంలో మైక్రో ప్లాస్టిక్స్ ఇన్ మెరైన్ ఎన్విరాన్‌మెంట్ అంశంపై నిర్వహించిన మూడు రోజుల శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించాలని సూచించారు. ప్లాస్టిక్ కాలుష్యం కారణంగా సముద్ర జీవులకు ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. యూరోపియన్ కమిషన్ అందించిన ప్రాజెక్టులో భాగంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 25 మంది పరిశోధకులు, అధ్యాపకులు, సహాయ ఆచార్యులు, మత్స్యశాఖ, జీవీఎంసీ అధికారులు ఈ శిక్షణ తరగతులకు హాజరయ్యారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య పి.జానకీరామ్, డాక్టర్ కె.ఉమాదేవి, విభాగ ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

## 180వ రోజుకు రూ.10 భోజనం



పేషెంట్ సహాయకులకు భోజనం అందజేస్తున్న మక్సూద్ అహ్మద్

**దాబాగార్డెన్స్:** రౌండ్ టేబుల్, స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా ప్రభుత్వ విక్టోరియా(ఘోషా) ఆస్పత్రిలో రూ.10కే భోజనం అందజేత సోమవారం నాటికి 180వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా భోజనంతోపాటు పోషకాలు కలిగిన హార్లిక్స్ పాలును పేషెంట్ సహాయకులకు అందించారు. కార్యక్రమంలో రౌండ్ టేబుల్ సంస్థ ప్రతినిధి మక్సూద్ అహ్మద్, స్వామి వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.